సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పేదలకు వరం



సీఎం రిలీఫ్‌ ఫండ్‌ మంజూరుపత్రాలను జోసఫ్‌కు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్‌

శేరిలింగంపల్లి: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ వరమని కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌ గౌడ్‌ తెలిపారు. నల్లగండ్లలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మదీనాగూడకు చెందిన కీర్తనకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ద్వారా మంజూరైన రూ. 1.20 లక్షల మంజూరు పత్రాలను జగదీశ్వర్‌గౌడ్‌ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు షేక్‌ ఖాజీ, ముస్తాఫా, భిక్షపతి, రత్నాకర్‌ రెడ్డి, కృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీఓ కార్యాలయంలో ప్రజావాణి

రాజేంద్రనగర్‌: అత్తాపూర్‌లోని రాజేంద్రనగర్‌ ఆర్టీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ ఆదేశానుసారం ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నామన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు, ఫిర్యాదులు, ఇతరాత్ర ఆర్జీలు, దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో...

రాజేంద్రనగర్‌: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్‌ రవికుమార్‌ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి అందుబాటులో ఉంటుందన్నారు. అత్తాపూర్‌, రాజేంద్రనగర్‌, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్‌ డివిజన్ల పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌ నగర్‌లో డ్రైనేజీ, మంజీరా వాటర్‌ రోడ్లపై ప్రవహిస్తున్నదని కాలనీ వాసులు కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదివారం కాలనీలో పర్యటించి డ్రైనేజీ సమస్య గురించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ్లలో మంజీరా వాటర్‌ పైపులైన్‌లకు ఆన్‌ ఆఫ్‌ అమర్చి తాగునీరు వృథాగా పోకుండా చూడాలని కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో భాస్కర్‌, షౌకత్‌ అలీ మున్నా, అగ్రవాసు, రవీందర్‌, ప్రభాకర్‌, అజామ్‌ తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య సందర్భంగా నేడు అభిషేకం

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ అవంతినగర్‌ మోతీనగర్‌ ఎక్స్‌టెన్షన్‌ కబీర్‌నగర్‌లోని శివరామాంజనేయ ఆలయంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు అమావాస్య సందర్భంగా ప్రత్యంగిరా సమేత కాలభైరవ స్వామికి విశేష అభిషేకం, కూష్మాండ దీపారాధన నిర్వహించనున్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 12.30 గంటలకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

దుప్పట్ల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: చలికి అలమటిస్తున్న నిరుపేదలకు పలువురు దాతలు దుప్పట్లు అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. హెచ్‌ఎంటీ శాతవాహన నగర్‌ వాకింగ్‌ గ్రూప్‌ పెద్దలు, బీవీఆర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఫౌండర్‌ అండ్‌ చైర్మన్‌ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున ఫుట్‌పాత్‌ల మీద, విశ్రాంతి భవనాల్లో, ఇతర షెల్టర్లలో చలిలో కనీసం దుప్పట్లు కూడా లేకుండా నిద్రిస్తున్న నిరుపేదలకు వెంకటరెడ్డి మిత్ర బృందంతో తిరిగి దుప్పట్లు కప్పి వారి పట్ల ప్రేమాభిమానాలు చూపుతున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలానగర్‌ ఏసీపీ హనుమంతరావు, రిటైర్డ్‌ ఎస్పీ సురేందర్‌ రెడ్డి, వాకింగ్‌ గ్రూప్‌ సభ్యులు రాధాకృష్ణ, వాకింగ్‌ గ్రూప్‌ ప్రెసిడెంట్‌ రామ్మోహన్‌రావు, జగన్మోహన్‌రావు, హనుమంతరావు, బీవీఆర్‌ యూత్‌ ప్రెసిడెంట్‌ శ్యామ్‌, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఇక ‘వెల్కం’ చెరువు!

- పెరుగుతున్న వాకర్స్‌. ఆహ్లాదం కోసం వచ్చేవారి సంఖ్య
- దుర్వాసన లేకుండా చేస్తే మరింత మంది వచ్చే అవకాశం

సుందరీకరణతో ఆకట్టుకుంటున్న మల్కంచెరువు



సుందరీకరణతో ఆకట్టుకుంటున్న మల్కంచెరువు

రాయదుర్గం: నగర శివారులోని రాయదుర్గం ‘మల్కం చెరువు’.. సందర్శకులను బాగా ఆకట్టుకుంటోంది. గచ్చిబౌలి డివిజన్‌ రాయదుర్గంలో పాత ముంబై జాతీయరహదారి పక్కనే ఉండటంతో ఆ రూట్లో వెళ్లే వారందరినీ రా.. రమ్మని ఆహ్వానిస్తున్నట్లుగా ఈ చెరువు దర్శనం ఇస్తోంది. దీనికి గొలుసుకట్టు చెరువు అనే పేరు కూడా ఉంది. ఈ చెరువుకు గతంలో ఉన్న చరిత్రను మరింత ఇనుమడింపచేసేలా అధికారులు సుందరీకరించారు. ఈ చెరువు సుందరీకరణ కన్నా ముందే రూ.65 లక్షల వ్యయంతో నగరంలోనే మొదటి గణేశ్‌ నిమజ్జన కోనేరును ఇక్కడ నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత రూ.30 కోట్ల వ్యయంతో అపర్ణ నిర్మాణ సంస్థ, జీహెచ్‌ఎంసీ, నీటిపారుదల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చెరువును పూర్తిస్థాయిలో సుందరీకరణ చర్యలు చేపట్టి అందరినీ ఆకట్టుకునేలా చేశారు. అయితే ఒకప్పుడు ఆ చెరువు చేపలు పట్టేవారు, విక్రయించే మత్స్యకారులతో సందడిగా ఉండేది. చెరువులో పిచ్చిమొక్కలు, కంపచెట్లు, అపరిశుభ్రతకు ఆలవాలంగా ఉండేది. సుందరీకరణ తర్వాత ఇప్పుడది ఉదయం, సాయంత్ర వేళల్లో సందర్శకులు, వాకర్స్‌తో కోలాహలంగా మారింది. కనువిందు చేసేవిధంగా గ్రీనరీని తీర్చిదిద్దారు. అక్కడ దుర్వాసన మాటే లేదు. చెరువు చుట్టూతా వాకింగ్‌, సైకిల్‌ ట్రాక్‌లు దర్శనమిస్తున్నాయి. ఫెన్సింగ్‌, లైటింగ్‌ ఏర్పాటు చేశారు.

మత్స్యకారులు, సందర్శకుల డిమాండ్లు

- చేపలు పెంచి, వాటిని పట్టుకొని విక్రయించే అవకాశం కల్పించాలని, వృత్తిలో కొనసాగేవి కల్పించాలని మత్స్యకారులు కోరుతున్నారు.
- చెరువులోంచి వచ్చే దుర్వాసనను పూర్తిగా అరికట్టాలని, పరిశుభ్రమైన వాతావరణంలో వాకింగ్‌ చేసే అవకాశం కల్పించాలని వాకర్స్‌ అంటున్నారు.
- యాంపీ థియేటర్‌, బోటింగ్‌ సౌకర్యం, యోగా సెంటర్‌, ఫౌంటెన్ల ఏర్పాటు వంటి వాటిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.



- మురుగునీటిని శుభ్రం చేసి కూడా చెరువులోకి వదలకుండా కేవలం వర్షాలతోనే ఇందులో నీరు నిల్వ ఉండేలా చూడాలని సందర్శకుల డిమాండ్‌ చేస్తున్నారు.





ఆరేళ్ల క్రితం రాయదుర్గంలోని మల్కంచెరువులో మత్స్యకారుల సందడి

గెహిస్‌ ఇమ్మిగ్రేషన్‌ లీగల్‌ సర్వీస్‌ ప్రారంభం



గెహిస్‌ ఇమ్మిగ్రేషన్‌ లీగల్‌ సర్వీస్‌ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దయాకర్‌, సుధాజైన్‌, ఎన్‌.ఎం గెహి

గచ్చిబౌలి: ఇమ్మిగ్రేషన్‌ అంతర్జాతీయ చట్టపరమైన విషయాలలో న్యాయ సేవలు అందిస్తామని గెహిస్‌ ఇమ్మిగ్రేషన్‌ ఇంటర్నేషనల్‌ లీగల్‌ సర్వీసెస్‌ మేనేజింగ్‌ పార్ట్‌నర్‌ ఎన్‌.ఎం.గెహి పేర్కొన్నారు. కొండాపూర్‌లోని వైట్‌ పీల్డ్‌లో గెహిస్‌ ఇమ్మిగ్రేషన్‌ ఇంటర్నేషనల్‌ లీగల్‌ సర్వీసెస్‌ సర్వీస్‌ కార్యాలయాన్ని టీపీసీసీ జనరల్‌ సెక్రెటరీ అద్దంకి దయాకర్‌, సోషలైట్‌ సుధాజైన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గెహి మాట్లాడుతూ భారత్‌, అమెరికా మధ్య ఇమ్మిగ్రేషన్‌ ఇబ్బందులను తొలగిస్తామన్నారు. బిజినెస్‌, వ్యక్తిగత వీసాల సమస్యల పరిష్కారంలో గెహిస్‌ కృషి చేస్తుందన్నారు. చదువు, బిజినెస్‌, గ్రీన్‌ కార్డు స్పోర్ట్స్‌కు సంబంధించి 1బి, ఈబీ5, ఈబీ–1సీ, ఈబీ–1ఏ, పి వంటి పలు రకాల వీసాలు భారత్‌, అమెరికాల మధ్య తోడ్పాటుకు దోహదం చేస్తాయని గెహి తెలిపారు. అంతర్జాతీయంగా న్యాయ సేవల కోసం డిమాండ్‌ పెరుగుతున్న నేపథ్యంలో గెహిస్‌ ఇమ్మిగ్రేషన్‌ కార్యాలయాన్ని నెలకల్పామని పేర్కొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్‌: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని న్యాయవాది నాగరాజు యాదవ్‌ పేర్కొన్నారు. ఆదివారం డివిజన్‌లోని బండ్లగూడ హనుమాన్‌ దేవస్థానంలో నిర్వహించిన హనుమాన్‌ చాలీసా పారాయణం భక్తులతో కలిసి పఠించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలలో దేశభక్తి, దైవభక్తి పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, విశ్వహిందూ పరిషత్‌ ప్రముఖ రామచంద్ర బజరంగదళ్‌, జిల్లా సహ సంయోజక్‌ మనోజ్‌ కుమార్‌, ప్రముఖ శిరీష్‌, హనుమాన్‌ చాలీసా పారాయణ కమిటీ సభ్యులు రవి పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయాలని చిన్నారుల నిరసన



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌, వట్టినాగులపల్లిని కలిపే మిస్సింగ్‌ లింక్‌ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్‌ స్థానికులు డిమాండ్‌ చేశారు. ఆదివారం ఇంద్రప్రస్థ, శాంతియా, హాల్‌మార్క్‌ గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీలకు చెందిన చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కలసి రోడ్డుపై ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మార్గంలో ప్రయాణం చేయలేని పరిస్థితి దాపురించిందని వాపోయారు. పాఠశాలలకు వెళ్లాలంటే భయమేస్తుందన్నారు. కొన్ని సందర్భాల్లో మట్టి రోడ్డులు కూడా మూసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు కూడా రాలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు పన్ను రూపంలో కడుతున్న కనీస సౌకర్యాలు కల్పించడంలేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు సమస్యను పరిష్కారించాలని డిమాండ్‌ చేశారు.

అవసరంలేని వైద్యం ఆరోగ్యానికి చేటు



ఇకిగాయ్‌ క్లీనిక్‌ను ప్రాంభించిన డాక్టర్‌ పీసీ గుప్తా, డాక్టర్‌ నితిన్‌ మోకల్‌ తదితరులు

డాక్టర్‌ పీసీ గుప్తా

గచ్చిబౌలి: కొందరు యూ ట్యూబ్‌ వీడియోలు చూసి లేని వ్యాధి ఉందని నిర్ధారించుకొని అవసరం లేని వైద్యం చేయించుకొని ఆరోగ్యానికి చేటు కొనితెచ్చుకుంటున్నారని వాస్కులర్‌ సొసైటీ వరల్డ్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ పీసీ గుప్తా అన్నారు. ఆదివారం కొండాపూర్‌లో జపాన్‌ ఇకిగాయ్‌ సిద్ధాంతాలతో ఏర్పాటు చేసిన ఇకిగాయ్‌ క్లీనిక్‌ను ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య విషయాల్లో సోషల్‌ మీడియాలోని వీడియోలు చూస్తూ చాలామంది మోసపోతున్నారని తెలిపారు. వ్యాధి నిర్ధారించకుండా అవసరం లేని వైద్యం మంచిదికాదని సూచించారు. అసోసియేషన్‌ ఆఫ్‌ ప్లాస్టిక్‌ సర్జన్‌ ఆఫ్‌ ఇండియా జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్‌ నితిన్‌ మోకల్‌ మాట్లాడుతూ ప్రపంచంలో భారత్‌ దేశం డయాబెటిక్‌ హబ్‌గా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహారపు అలవాట్లలో మార్పు, వ్యాయామం చేయడం వల్ల డయాబెటిక్‌ నుంచి కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఇకిగాయ్‌ వైద్యులు ఆత్రేయపురపు విశ్వనాథ్‌, మణికాంత్‌ కారుమూరి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం

పీఏసీ చైర్మన్‌ గాంధీ



వైద్య పరీక్షలు చేయించుకున్న గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్‌ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో స్టార్‌ హాస్పిటల్‌ సౌజన్యంతో శ్రీ సాయి సత్సంగ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్‌ క్యాంప్‌ను డీఆర్‌డీఓ చైర్మన్‌ డాక్టర్‌ సతీష్‌ రెడ్డి, స్టార్‌ హాస్పిటల్‌ డాక్టర్‌ గూడపాటి రమేష్‌, కార్పొరేటర్‌ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్‌ డివిజన్‌, హెచ్‌ఎంటీ హిల్స్‌ కాలనీలో ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలు నివసిస్తున్నారని, ఇక్కడి ప్రాంత ప్రజలకు ఇలాంటివి ఎంతో దోహదపడతాయన్నారు. ఉచితంగా రక్త పరీక్షలు, జనరల్‌, దంత వైద్యం, బీపీ, షుగర్‌, గైనకాలజీ, ఆర్థో, ఈసీజీ, ఈఎన్‌టీ వంటి సేవలు ఒకే చోట ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

సగర సంఘం నూతన కార్యవర్గం



మణికొండ: సగర (ఉప్పర) సంఘం మణికొండ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మణికొండలోని సంఘం కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు గౌరవ అధ్యక్షుడు మహదేవ్‌సాగర్‌ తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్‌.వెంకటేశ్‌సాగర్‌, డి.హనుమంతుసాగర్‌, జి.దేవేందర్‌, అధ్యక్షుడిగా జి.వెంకటస్వామి సాగర్‌, ప్రధాన కార్యదర్శులుగా జి.గోపాల్‌సాగర్‌, వి.కృష్ణసాగర్‌, కోశాధికారులుగా పి.కృష్ణయ్య, ఎ.నాగేశ్వర్‌సాగర్‌, ఉపాధ్యక్షులుగా కె.అశోక్‌సాగర్‌, ఆర్‌.నర్సింహులు సాగర్‌, జి.కృష్ణసాగర్‌లను ఎన్నుకున్నట్టు ఆయన వివరించారు. వీరితో పాటు గౌరవ సలహాదారులుగా కాశన్నసాగర్‌, ఎ.నాగరాజు సాగర్‌, బుచ్చన్నసాగర్‌, ఎ.వెంకటస్వామిసాగర్‌, సంయుక్త కార్యదర్శులుగా వి.అశోక్‌సాగర్‌, కె.రఘుపతిసాగర్‌, కె.బాలకృష్ణసాగర్‌, ఎస్‌.వెంకటేష్‌సాగర్‌,. కె.శేఖర్‌సాగర్‌, నాగరాజు సాగర్‌, జి.రవిసాగర్‌, ఆర్‌.బాలరాజు, బి.నర్సింహాసాగర్‌, ప్రచార కార్యదర్శులుగా కె.గిరిసార్‌, జి.రాజుసాగర్‌, విష్ణు, ఆర్‌.రమణ, బి.యాదయ్యలను ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యవర్గానికి పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుందన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 12.00 నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు.

- ఇంద్రారెడ్డి ఆల్విన్‌ కాలనీ, మార్తాండ నగర్‌, ఆదిత్యా ఇంపీరియల్‌ హైట్స్‌, వైశాలీ నగర్‌, మైత్రీ నగర్‌ ఫీడర్ల పరిధిలో మార్తాండ నగర్‌, వైశాలీనగర్‌, న్యూ హఫీజ్‌పేట్‌, ఆదిత్యా ఇంపీరియల్‌ హైట్స్‌, మైత్రీనగర్‌, ఇంద్రారెడ్డి ఆల్విన్‌ కాలనీ, సప్తగిరి కాలనీ, ఏపీఎస్‌జీ కాలనీ ఏరియాలలో విద్యుత్‌సరఫరా ఉండదని పేర్కొన్నారు.

శేరిలింగంపల్లి: విద్యుత్‌ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ఫీడర్ల పరిధిలో కరెంటు సరఫరాను సోమవారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ జవహర్‌ నవోదయ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకు డైమండ్‌ హిల్స్‌, నల్లగండ్ల హుడా కాలనీ, కంచ గచ్చిబౌలి, జవహర్‌ నవోదయ స్కూల్‌ ఏరియాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తారు.
- 11 కేవీ లక్ష్మీవిహార్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నల్లగండ్ల విలేజ్‌, లక్ష్మీవిహార్‌ ఫేజ్‌–1, ఫేజ్‌–2 కాలనీలు, డాక్టర్స్‌ కాలనీ, డిఫెన్స్‌ కాలనీల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తారు. విద్యుత్‌ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

మియాపూర్‌: మయూరినగర్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సోమవారం కరెంటు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రవిచంద్ర తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దివ్యశక్తి ఫీడర్‌ పరిధిలోని దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్‌, రాంనరేష్‌ నగర్‌, హైదర్‌నగర్‌ విలేజ్‌, మిత్ర హిల్స్‌, ఏఎస్‌ రాజు నగర్‌, ప్రశాంత్‌నగర్‌, మయూరినగర్‌ ఫీడర్‌ పరిధిలోని ఎస్‌బిఐ బ్యాంకు లైన్‌, మయూరినగర్‌, ప్రశాంత్‌ నగర్‌ ఫీడర్‌ పరిధిలోని మయూరినగర్‌, ఓల్డేజ్‌హోం, ఇంద్రమ్మ హౌస్స్‌, వాటర్‌ ట్యాంకు –2, గోకరాజు రంగరాజు కళాశాల రోడ్డు, కేటీఆర్‌ కాలనీ, నిజాంపేట్‌, ఆర్‌డీటీ కోకోనట్‌ గ్రో, బ్రో వెంచర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

చందానగర్‌: వేమన కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- కేఎస్‌ఆర్‌ ఫీడర్‌ పరిధిలో కేఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌, పీజేఆర్‌ రోడ్డు నెంబర్‌ 2,4,6,8 ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండన్నారు.

రంగోలీ పోటీలు



రంగోలీ పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేస్తున్న రామస్వామి యాదవ్‌

శేరిలింగంపల్లి: ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, కామిరిశెట్టి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలోని నేతాజీనగర్‌లో రంగోలీ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ టి.రామస్వామి యాదవ్‌ మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు పండుగలని అన్నారు. మహిళలు ఉదయాన్నే ఇంటి ముందు రంగవల్లులను తీర్చిదిద్దడం భారతీయ సనాతన సంప్రదాయమని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి, చందానగర్‌ సర్కిల్స్‌ పరిధిలోని 35 కాలనీల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా టి.వరలక్ష్మీ, అనూషలు వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు శివరామకృష్ణ, స్థానిక మహిళా నాయకురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం



ఆరికెపూడి గాంధీని కలిసిన నల్లగండ్ల హుడా కాలనీ నేత సత్యనారాయణరావు తదితరులు

పీఏసీ చైర్మన్‌ ఆరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తానని పీఏసీ చైర్మన్‌ ఆరికెపూడి గాంధీ తెలిపారు. నల్లగండ్ల హుడా కాలనీ అసోసియేషన్‌ ప్రతినిధులు ఆదివారం ఆయన నివాసంలో కలిసి కాలనీలో అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లతో పాటు మంచినీటి వ్యవస్థ, వీధిదీపాల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు గాంధీ సానుకూలంగా స్పందించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. వీధి దీపాల ఏర్పాటుతోపాటు మంచినీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలో కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలిస్తానని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, ప్రతినిధులు ప్రభాకర్‌ రెడ్డి, వర్మ, నవీన్‌, చంద్ర, కృష్ణ, విజయ్‌, రమేష్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో తాండ్ర కుమార్‌ స్మారక క్రికెట్‌ పోటీలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌ తదితరులు

మియాపూర్‌: ఏఐఎఫ్‌డీఎస్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 6, 7 తేదీల్లో క్రికెట్‌ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం గ్రేటర్‌ కమిటీ కన్వీనర్‌ తెలిపారు. ఆదివారం కమిటీ సభ్యులతో కలిసి తాండ్ర కుమార్‌ మెమోరియల్‌ క్రికెట్‌ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండ్ర కుమార్‌ మెమోరియల్‌ క్రికెట్‌ పోటీలు చందానగర్‌ పీజేఆర్‌ స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రికెట్‌ పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు డయల్‌ యువర్‌ ఆర్టీసీ డీఎం

రాజేంద్రనగర్‌: టీజీ ఆర్టీసీ రాజేంద్రనగర్‌ డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు, సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా సోమవారం డయల్‌ యువర్‌ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్‌ డిపో మేనేజర్‌ బ్రదీనారాయణ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణికులు తమ ఫిర్యాదులను ఫోన్‌: 99592 26135లో తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌ వైర్లు

- చిన్నపాటి గాలులకే తీగలు తగిలి షార్ట్‌ సర్క్యూట్‌
- అధికారులు స్పందించాలని కాలనీల విజ్ఞప్తి





ఇళ్లకు అనుకొని ఉన్న విద్యుత్‌ వైర్లు

ఆల్విన్‌కాలనీ: విద్యుత్‌ తీగలు ఇళ్ల గుమ్మాలకు, శ్లాబులకు దగ్గరలో వేలాడుతుండటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. కూకట్‌పల్లి, ఆల్విన్‌ కాలనీ ఫేజ్‌ 2 ఏర్పడినప్పుడు విద్యుత్‌ స్తంభాలను నాటి వైర్లను ఏర్పాటు చేశారు. విద్యుత్‌ స్తంభాలకు ఏర్పాటు చేసిన వైర్లు సాగిపోయి వేలాడుతుండటంతో విద్యుత్‌ అధికారులు వాటికి సపోర్టుగా ప్లాస్టిక్‌ పరికరాలను ఏర్పాటు చేశారు. అవి కూడా పాతపడిపోవటంతో విద్యుత్‌ వైర్లు చేతికి అందే అంత ఎత్తులో వేలాడుతూ ఉన్నాయి. చినపాటి గాలులకే ఒక దానికి ఒకటి తగిలి షార్ట్‌ సర్క్యూట్‌ జరిగి ఇళ్లలోని ఎలక్ట్రికల్‌ వస్తువులు కాలి బూడిదవుతున్నాయని, ఆస్తి నష్టం వాటిల్లుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అదే విధంగా విద్యుత్‌ స్తంభాలకు కేబుల్‌ వైర్లు ఏర్పాటు చేయటంతో స్తంభానికి గుట్టలు గుట్టలుగా వేలాడుతున్నాయి. గత వేసవిలో విద్యుత్‌ వైర్ల మంటలకు కేబుల్‌ వైర్లు కూడా అంటుకుని ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. గత సంవత్సరం కొన్ని ప్రాంతాల్లో చిన్నగా ఉన్న స్తంభాలను తొలగించి పెద్ద స్తంభాలకు విద్యుత్‌ వైర్లను ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో వదిలివేయటంతో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గాలులకు, ఎండకు ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.